క్లుప్తంగా

ఎమ్మెల్యే సబితారెడ్డిని కలిసిన నాయకులు



ఎమ్మెల్యే సబితారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

చేవెళ్ల: మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితారెడ్డిని చేవెళ్ల బీఆర్‌ఎస్ నాయకులు కలిశారు. బుధవారం ఆమె నివాసంలో కలిసి నూతన సంవత్సరం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నూతన సంవత్సరంలో అందరికి మంచి జరగాలని ఆకాంక్షించారు. అందరూ బాగా కష్టపడి పనిచేసి పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మోజార్టీ స్థానాలు కై వసం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ పి.కృష్ణారెడ్డి, తంగెడపల్లి మాజీ సర్పంచ్‌లు రాములు, సత్తయ్య, నాయకులు చందరయ్యగౌడ్, శ్రీపాల్, మాధవరెడ్డి, తదితరులు ఉన్నారు.

ఘనంగా గీతపారాయణం



గీత పారాయణంలో పాల్గొన్న భక్తులు

కేశంపేట: మండల పరిధిలోని తొమ్మిదిరేకుల గ్రామంలో గల కిషన్ ప్రభు ఆశ్రమంలో శ్రీకిషన్ ప్రభు గీత ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో బుధవారం గీత పారాయణం, విష్ణు సహస్ర నామాలు, హనుమాన్ చాలీసాను భక్తులు పఠించారు. భోదరంగదాసు ఆధ్వర్యంలో పారాయణంను ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులు, గ్రామస్తులకు గనికిదేవి సుభాష్ అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో కిషన్ ప్రభు ఆశ్రమ పీఠాధిపతి ఆంజనేయులు, కిషన్ ప్రభు గీత ప్రచార సమితి రాష్ట్ర అధ్యక్షుడు అయ్యపురెడ్డి, జిల్లా అధ్యక్షుడు రంగదాసు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు అనసూయ, రంగయ్య, సంతోష్, బాలస్వామి, శ్రీరాములు, లక్ష్మయ్య, వెంకట్‌రెడ్డి, ప్రమీల, అలివేలు, స్వాతి, అండాలు తదితరులు పాల్గొన్నారు.

మురుగు.. పరుగు!

- దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు



రోడ్డుపై చేరిన మురుగు

ధారూరు: నాగసమందర్ గ్రామంలోని వివిధ కాలనీల్లో నిత్యం మురుగు పరుగు తీస్తుంది. ఇదంతా రోడ్డుపై చేరడంతో దోమలు, ఈగలు ఎక్కువై రోగాలు వ్యాపింపజేస్తున్నాయి. ఇళ్ల మధ్య రోడ్డుపై మురుగునీరు ప్రవహించడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని పట్టించుకునే అధికారులు కరువయ్యారు. కనీసం నడవడానికి వీలు లేకుండా రోడ్డుపై చేరడంతో స్థానికుల రాకపోకలకు తిప్పలు తప్పడం లేదు. ఈ విషయాన్ని గ్రామ కార్యదర్శికి ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా స్పందించి మురుగుప్రవాహాన్ని అడ్డుకట్ట వేయాలని కోరారు.

రేపు మోడల్ స్కూల్లో క్విజ్ పోటీలు

తాండూరు రూరల్: పెద్దేముల్ మండలంలోని మోడల్ స్కూల్లో శుక్రవారం మండలస్థాయి క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎల్‌ఎస్‌ఆర్ వ్యవస్థాపకుడు లొంక నర్సిములు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు ఆయా పాఠశాల నుంచి ఇద్దరు చొప్పున ఈ పోటీలకు హాజరు కావాలని కోరారు. విజేతలకు మొదటి బహుమతి రూ.10వేలు, రెండవ రూ.5వేలు, మూడో బహుమతి రూ.3వేలు అందజేస్తామని పేర్కొన్నారు.

పడకేసిన పశువైద్యం



పాపిరెడ్డిగూడలో మూతబడిన పశువైద్య ఉపకేంద్రం

- సిబ్బంది కొరతతో మూగజీవాలకు అందని వైద్యం
- ప్రైవేట్ వైద్యులను ఆశ్రయిస్తున్న పశుపోషకులు
- పలు గ్రామాల్లో శిథిలావస్థకు చేరిన భవనాలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

కేశంపేట: మూగజీవాలకు పశువైద్యం అందని ద్రాక్షలా మారింది. పశువైద్యశాలల్లో సిబ్బంది కొరతతో పాటు సరిపడా వసతులు లేక పశువులకు సరైన వైద్యం అందడం లేదు. పలు గ్రామాల్లో భవనాలు శిథిలావస్థకు చేరాయి. పశువైద్యశాలల్లో గడిచిన పదేళ్ల కాలంగా ఖాళీ పోస్టులు భర్తీకి నోచుకోవడం లేదు. దీంతో మూగజీవాలకు సరైన వైద్యం అందక మృత్యువాతపడుతున్నాయి. మండల పరిధిలో రెండు పశువైద్య కేంద్రాలతో పాటు నాలుగు ఉపకేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో డాక్టర్లు వారికి సహాయకులతో పాటు సిబ్బంది అవసరం ఉంటుంది. కొత్తగా ఇటీవలే కొలువుదీరిన కాంగ్రెస్‌లో అయినా పశుసంవర్ధక శాఖలో పోస్టుల భర్తీకి మోక్షం కలగక పోదా అని పాడిరైతులు కోటి ఆశలతో ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం పశు సంపదను పెంచడానికి సరైన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

వేధిస్తున్న సమస్యలు

మండల కేంద్రమైన కేశంపేటతో పాటు కొత్తపేట గ్రామంలో పశువైద్య కేంద్రాలు, నిర్దవెల్లి, కొండారెడ్డిపల్లి, పాపిరెడ్డిగూడ, ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామాల్లో పశువైద్య ఉపకేంద్రాలు ఉన్నాయి. మండలంలో ఇద్దరు డాక్టర్లతో పాటు పారాస్టాఫ్ ఆరుగురు, ఆఫీస్ సబార్డినేటర్లు ఆరుగురు ఉండాలి. వీరిలో ఇద్దరు డాక్టర్లతో పాటుగా ఒక్క పారాస్టాఫ్, ఇద్దరు ఆఫీస్ సబార్డినేటర్లు ఉన్నారు. ఐదుగురు పారాస్టాఫ్‌తో పాటుగా 4 ఆఫీస్ సబార్డినేటర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మండలంలో ఆవులు, బర్రెలు, ఎద్దులు సుమారుగా 12,547, మేకలు, గొర్రెలు సుమారుగా 23,870 ఉన్నాయి. మండలంలో అత్యధిక మంది రైతులు వ్యవసాయం, పాల వ్యాపారంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. సిబ్బంది లేకపోవడంతోనే పశువులకు సరైన సమయంలో వైద్యం అందక మృత్యువాతపడుతున్నాయి.

ఇన్‌చార్జి వచ్చేవరకు ఆగాల్సిందే

పశువైద్యశాలల్లో పూర్తిస్థాయి సిబ్బంది లేకపోవడంతో ఉన్న సిబ్బంది ఎక్కడ ఉంటారో, ఎప్పుడు గ్రామానికి వస్తారో అని ఎదురుచుడాల్సిన పరిస్థితి రైతులకు, పాడిపోషకులకు నెలకొంది. ఒక్కొక్క సిబ్బంది మూడు వైద్య ఉపకేంద్రాలకు వెళ్లాల్సి రావడంతో వారు రైతు వద్దకు సరైన సమయంలో రాలేకపోతున్నారు. ప్రభుత్వం మండలంలో పూర్తిస్థాయి సిబ్బందిని నియమించాలని రైతులు కోరుతున్నారు.

శిథిలమైన భవనాలు

మండలంలోని ఎక్లాస్‌ఖాన్‌పేట, పాపిరెడ్డిగూడ గ్రామాల్లో ఉన్న పశువైద్య ఉపకేంద్రాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. అధికారులు ఇక్కడికి రాకపోవడం, వినియోగంలో లేకపోవడంతో భవనాలు శిథిలావస్థకు చేరాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. నిర్దవెల్లి గ్రామంలో భవనానికి తలుపులతో పాటు కిటికీలు లేకపోవడంతో మందులు భద్రపరిచేందుకు ఇబ్బంది పడుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



పాపిరెడ్డిగూడ గ్రామంలో పశువైద్య ఉపకేంద్రం ఉంది. ఈ కేంద్రానికి ఎప్పుడు వైద్యులు రావడం లేదు. దీంతో పశువులకు జబ్బులు చేసినప్పుడు ప్రైవేట్ వైద్యులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో తాము ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాం. ఇప్పటికైనా ఉన్నాతాధికారులు స్పందించి పశువైద్యుడిని నియమించాలి.

–జయరాం, తూర్పుగడ్డతండా

పట్టించుకోవడం లేదు



మండలంలో పశువైద్యాధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో సరైన సమయంలో పశువులకు వైద్యం అందక రైతులు ఎంతో నష్టపోతున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలి. పశువైద్యులను, సిబ్బందిని నియమిస్తే పాడిరైతులకు ఇబ్బందులు తీరుతాయి.

–కుమ్మరి మహేశ్, పోమాల్‌పల్లి

కొరత ఉంది



మండలంలోని పశువైద్యశాలలు, ఉపకేంద్రాలకు కావాల్సినంత సిబ్బంది లేరు. ఉన్న సిబ్బంది అన్ని గ్రామాలకు వెళ్లి వైద్యసేవలు అందిస్తున్నారు. ఒక్కో కేంద్రానికి వారంలో రెండు రోజులు అందుబాటులో ఉంటున్నాం. అత్యవసర స్థితిలో రైతుల నుంచి సమాచారం వస్తే వెళ్లి సేవలందిస్తున్నాం

– నివేధిత, మండల పశువైద్యాధికారి

కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి



ఆలయ సన్నిధిలో మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులు

మహబూబ్‌నగర్ మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి

మొయినాబాద్‌రూరల్: కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి అని దేవాలయాల్లోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక సలహాదారులు, మహబూబ్‌నగర్ మాజీ ఎంపీ జితేందర్ రెడ్డి పేర్కొన్నారు. కొత్త సంవత్సరం పురస్కరించుకొని బుధవారం మండల పరిధిలోని కనకమామిడి వేంకటేశ్వరస్వామిని కుటుంబ సభ్యులతో ఆయన దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, గ్రామస్తులు కుంభమేళంతో ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆయనను శాలువా పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం నూతన సంవత్సరాన్ని వేడుకగా తీసుకొని కనకమామిడి వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్నామన్నారు. ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో వేంకటేశ్వరస్వామి దేవాలయ చైర్మన్ కొండా లక్ష్మీకాంత్‌రెడ్డి, నిర్వాహకులు బుచ్చిరెడ్డి, బల్వంత్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, నర్సింహారెడ్డి, వివిధ గ్రామాల భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మహార్‌ల పోరాటం మరువలేనిది



యుద్ధవీరులకు నివాళులర్పిస్తున్న సమతా సైనిక్ దళ్ సభ్యులు, తదితరులు

సమతా సైనిక్ దళ్ జిల్లా నాయకులు ఏర్పుల మల్లేశ్, ఎం.రామస్వామి

చేవెళ్ల: మహార్ యుద్ధవీరుల పోరాటం ద్వారానే అంటరాని కులాలకు విద్యనభ్యసించే అవకాశం కలిగిందని సమతా సైనిక్ దళ్ జిల్లా నాయకులు ఏర్పుల మల్లేశ్, ఎం.రామస్వామి అన్నారు. బుధవారం నగరంలోని లోయర్ ట్యాంక్ బండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద సమతా సైనిక్ దళ్ ఆధ్వర్యంలో భీమాకోరేగావ్ మహార్ యుద్ధంలో అమరులైన యుద్ధవీరులకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా చేవెళ్ల నుంచి వెళ్లిన సమతా సైనిక్ దళ్ సభ్యులు పాల్గొని ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. భీమాకోరేగావ్ యుద్ధం 1818 జనవరి 1వ తేదీన జరిగిందన్నారు. ఈ యుద్ధంలో అమరులైన యుద్ధవీరులకు గుర్తుగా మహారాష్ట్రలోని పూణె నగరంలో భీమా నది ఒడ్డున మహార్ యుద్ధ వీరులకు, విజయానికి గుర్తుగా స్తూపం నిర్మించినట్లు చెప్పారు. మహార్‌ల పోరాటాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సమతా సైనిక్ దళ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మాచనపల్లి రాంచందర్, ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి మహేశ్, జిల్లా అధ్యక్షుడు బి.ప్రభాకర్, చేవెళ్ల మండల అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్, ఆలూరు గ్రామ జై భీమ్ యువజన సంఘం అధ్యక్షులు ఎల్లకొండ నర్సింలు, పూలపల్లి ప్రవీణ్‌కుమార్, పూలపల్లి తరుణ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరు చేయండి

డిప్యూటీ సీఎంకు ఎమ్మెల్యే వినతి



డిప్యూటీ సీఎంకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్‌రూరల్: నియోజకవర్గానికి నూతనంగా విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందజేశారు. బుధవారం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ప్రగతి భవన్‌లో ఎమ్మెల్యే డిప్యూటీ సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని కొన్ని గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు లేకపోవడంతో విద్యుత్ సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని లాల్‌పహాడ్, మల్కపహాడ్, కొందుర్గు మండలంలోని మహదేవ్‌పూర్, చెరుకుపల్లి, ఫరూఖ్‌నగర్ మండలంలోని ఎలికట్ట, చింతగూడ గ్రామాల్లో నూతనంగా 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లను మంజూరు చేయాలని డిప్యూటీ సీఎంను కోరానన్నారు. నూతన సబ్‌స్టేషన్ల ఏర్పాటుతో గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. గ్రామాల్లో నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు కృషి చేస్తానన్నారు.

సమస్యలపై పోరాడాలి

నవాబుపేట: బీఆర్‌ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శాంతకుమార్ బుధవారం బీఆర్‌ఎస్ నేత సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావును కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడారు. బీఆర్‌ఎస్‌కు మంచి రోజులు రానున్నాయని, నిత్యం ప్రజల్లో ఉండి ప్రజాసమస్యలపై పోరాడాలని ఆయన తెలిపారన్నారు.



హరీశ్‌రావుతో శాంతకుమార్

‘మార్కెట్ కమిటీ’లో మొయినాబాద్‌కు అన్యాయం

కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు రాములు

మొయినాబాద్: గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ పదవుల పంపిణీలో మొయినాబాద్ మండలానికి తీవ్ర అన్యాయం జరిగిందని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ మోత్కుపల్లి రాములు, ఏఎంసీ మాజీ చైర్మన్ దారెడ్డి కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం మొయినాబాద్‌లో వారు విలేకరులతో మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాల రైతులు కూరగాయలు, పూలను గుడిమల్కాపూర్ మార్కెట్‌కే తీసుకెళ్తారన్నారు. గుడిమల్కాపూర్ మార్కెట్‌కు అతి చేరువలో ఉన్న మొయినాబాద్ మండలానికి మార్కెట్ కమిటీలో చోటు కల్పించకపోవడం బాధాకరమన్నారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య కాంగ్రెస్ పార్టీలో చేరినా ఏకపక్ష ధోరణి అవలంబిస్తున్నారని, పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి ప్రాధాన్యత దక్కడం లేదన్నారు. చేవెళ్ల నియోజకవర్గంలో శంకర్‌పల్లి, చేవెళ్ల, షాబాద్‌లో మార్కెట్ యార్డులు ఉన్నాయని, ఆ మార్కెట్ కమిటీల్లో ఆ మండలాల వారికే పదవులు దక్కాయన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మరోవైపు ఆ మూడు మండలాల నాయకులకే గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీలోనూ పదవులు ఇచ్చారని మండిపడ్డారు. మొయినాబాద్ మండలానికి మార్కెట్ కమిటీ లేదని, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీలో అయినా మండలానికి చెందిన వారికి పదవులు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. గత డిసెంబర్ 14న సీఎం రేవంత్‌రెడ్డి చిలుకూరు గురుకులానికి వచ్చినప్పుడు సైతం ఎమ్మెల్యే స్థానిక కాంగ్రెస్ నాయకులకు సమాచారం ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడ్డవారిని పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఇదే పద్ధతి కొనసాగితే మున్ముందు కాంగ్రెస్ పార్టీకి తీవ్ర నష్టం జరుగుతుందని హెచ్చరించారు.

వైభవంగా ఇరుముళ్ల పూజ



ఇరుముళ్లు కడుతున్న గురుస్వాములు

మొయినాబాద్‌రూరల్: ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలని తద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ ఉపాధ్యక్షురాలు ముదిగొండ మంజులరవియాదవ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్ జిల్లా పరిషత్ పాఠశాలలో గురుస్వాములు మహేందర్‌యాదవ్, మురళీ ఆధ్వర్యంలో అయ్యప్ప ఇరుముళ్ల మహాపడి పూజను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి హోమం, కుమారస్వామికి ప్రత్యేక పూజలు చేసి అయ్యప్పకు నూతన వస్త్రాలు, పండ్లు సమర్పించారు. అనంతరం గ్రామంలో మాలధరించిన 25 మంది స్వాములకు గురుస్వాములు ఇరుముళ్లను కట్టారు. ఈ పూజా కార్యక్రమంలో మంజులరవియాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పూజల్లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాశ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కంజర్ల భాస్కర్, మాజీ సర్పంచ్‌లు ముదిగొండ రాజయ్య, శ్రీహరియాదవ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

‘నూతన’ సందడి

నూతన సంవత్సర వేడుకలను చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గ ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. 2025కు స్వాగతం పలుకుతూ సంబురాలు చేసుకొన్నారు. మంగళవారం అర్ధరాత్రి బుధవారం తెల్లవారు జామున భారీగా కేక్‌లు కట్ చేసి. బాణసంచా కాల్చారు. హ్యాపీ న్యూయర్ అంటూ కేరింతలు కొట్టారు. మహిళలు, యువతులు ఇంటి ముంగిట్లో అందంగా రంగవల్లులు వేశారు. అనంతరం ఒకరికొకరూ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ఈ సందర్భంగా ఉదయం నుంచే ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.



మొయినాబాద్‌రూరల్: అమ్డాపూర్ రక్షమైసమ్మ దేవాలయంలో దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు



మొయినాబాద్‌రూరల్: స్వామి నారాయణ గురుకుల్ లోటస్ టెంపుల్‌లో భక్తుల సందడి



షాబాద్: నాగర్‌గూడ శ్రీకృష్ణ దేవాలయంలో దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



చేవెళ్లలో..



చేవెళ్ల: బాలాజీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో దర్శనం కోసం క్యూలైన్‌లో వెళ్తున్న భక్తులు



మొయినాబాద్‌రూరల్: కేక్ కట్ చేస్తున్న కాలనీ వాసులు



మొయినాబాద్‌రూరల్: అమ్డాపూర్‌లో ముగ్గులు వేస్తున్న మహిళ, చిన్నారి

రైతుల పాట్లు!

- శనగ పంటకోసం పొలం చుట్టూ కంచెవేసి అడ్డుగా చీరలు
- జంతువుల నుంచి కాపాడుకునేందుకు తంటా

మోమిన్‌పేట: రైతులు సాగు చేస్తున్న పంటలను జంతువులు, అడవి పందులు, నెమలుల నుంచి కాపాడుకునేందుకు నానా పాట్లు పడుతున్నారు. పంట పొలాల చుట్టూ చీరలు అడ్డుగా కడుతున్నారు. మందులను స్ప్రే చేయడం, సోలార్ ఫెన్సింగ్ లాంటివి చేస్తున్నారు. ఇదే తరహాలో మండల పరిధిలోని ఎన్కేపల్లి గ్రామ రైతు నాగయ్య తన శనగ పంటను కాపాడుకునేందుకు, నెమలులు శనగ ఆకును తినకుండా పొలంలో కర్రలకు గుడ్డలు, చీరలు, కట్టి నిలబెట్టాడు. గాలి వీయడం వల్ల వచ్చేశబ్దంతో నెమలులు రావడం లేదంటున్నాడు. అడవి పందుల నుంచి రక్షణగా పాలిహౌజ్ కవర్లను పొలం చుటూ కట్టాడు. ఇలా అడవి జంతువుల నుంచి రైతులు పంటలను కాపాడుకొంటున్నారని చెబుతున్నారు.



ఎన్కేపల్లిలో సాగు చేస్తున్న శనగ పంట